# అభివృద్ధి మీ కళ్ల ముందే ఉంది..

- దానిని గమనించండి.. బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ గెలుపునివ్వండి..
- నాడు అంతటా మట్టి రోడ్లే.. నేడు ఏ వీధికి వెళ్లినా సీసీ రోడ్లే..
- సత్తుపల్లి పట్టణ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర


డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద సండ్రకు స్వాగతం పలుకుతున్న మహిళలు

సత్తుపల్లి టౌన్, నవంబర్ 13: తెలంగాణ సిద్ధించాక ఈ పదేళ్లలో జరిగిన అభివృద్ధి ప్రజల కళ్ల ముందే ఉందని సత్తుపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో సత్తుపల్లి నియోజకవర్గం ఎంతటి అభివృద్ధిని సాధించిందో ఇక్కడి ప్రజలు చూస్తూనే ఉన్నారని అన్నారు. రాష్ట్రంలోనూ, నియోజకవర్గంలోనూ జరిగిన అభివృద్ధిని గమనించి బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. సత్తుపల్లి పట్టణంలో సోమవారం పర్యటించిన ఆయన.. పలు వార్డుల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడి ప్రజలు ఇప్పటికే మూడు పర్యాయాలు తనను ఎమ్మెల్యేగా గెలిపించారని, నాలుగోసారి కూడా బరిలో ఉన్నానని అన్నారు. తాను చేసిన అభివృద్ధిని గమనించి ఈ ఎన్నికల్లోనూ తనను ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్రంలో 60 ఏళ్లలో జరగని అభివృద్ధిని సీఎం కేసీఆర్ ఈ పదేళ్లలో చేసి చూపించారని గుర్తుచేశారు. నాడు ఎక్కడా చూసినా మట్టి రోడ్లే దర్శనమిచ్చేవని, కానీ నేడు ఏ వీధికి వెళ్లినా సీసీ రోడ్లే కన్పిస్తున్నాయని అన్నారు. వేంసూరు రోడ్డులో 250 ఎకరాల్లో అర్బన్ పార్క్ ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేశామన్నారు. రూ.35 కోట్లతో వంద బెడ్ల ఆసుపత్రిని నిర్మించామని, ఇంకా మరెన్నో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. దళితబంధు పథకంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు కచ్చితంగా అమలు చేస్తామని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కొత్తూరి ఉమామహేశ్వరరావు, కూసంపూడి మహేశ్, మట్టా ప్రసాద్, నరుకుళ్ల మమత, వేముపల్లి మధు, షేక్ రఫీ, యాగంటి శ్రీనివాసరావు, మట్టా రమేష్, నరుకుల శ్రీను, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



# బయటివారి మాటలకు మోసపోవద్దు

- నేను స్థానికుడిని.. ఐదేళ్లలో పాలేరును ఎంతో అభివృద్ధి చేశా..
- బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తేనే మరిన్ని సంక్షేమ పథకాలు..
- తిరుమలాయపాలెం ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ

తిరుమలాయపాలెం, నవంబర్ 13 : ఎక్కడెక్కడివారో ఇక్కడికి వచ్చి పోటీచేస్తూ ఓట్లు అడుతుతున్నందున వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని పాలేరు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి కందాళ ఉపేందర్‌రెడ్డి సూచించారు. తాను కూసుమంచి మండలం రాజుపేట గడ్డ మీద పుట్టిన మీ బిడ్డనని, పక్కాగా లోకల్ బిడ్డనేనని అన్నారు. గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని అన్నారు. తానెప్పుడూ అబద్ధాలు చెప్పనని, చెప్పిందే చేస్తానని, చేసిందే చెప్పానని అన్నారు. ప్రభుత్వం అందించిన నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా తన సొంత నిధులతో కూడా నియోజకవర్గంలోని అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించానని గుర్తుచేశారు. తనను మళ్లీ గెలిపిస్తే మరింత సేవచేస్తానని అన్నారు. రాష్ట్రంలో కూడా బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తేనే మరిన్ని సంక్షేమ పథకాలు అమలవుతాయని అన్నారు. తిరుమలాయపాలెం మండలంలో సోమవారం పర్యటించిన ఆయన.. హస్నాబాద్, లక్ష్మీదేవిపల్లి, రఘునాథపాలెం, సుద్దవాగుతండా, మంగళిబండతండా, జల్లేపల్లి, జోగులపాడు, చంద్రుతండాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారాల్లో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ మేరకు పాలేరు నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో దళితబంధును అమలు చేస్తామని అన్నారు. తెల్లకార్డు కలిగిన పేదలందరికీ సన్న బియ్యం అందజేస్తామని, రైతుబీమా తరహాలోనే భూమిలేని పేదలందరికీ రూ.5 లక్షల బీమాను కల్పిస్తామని వివరించారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు బానోత్ సత్యవతి, తాళ్లూరి జీవన్, బాషబోయిన వీరన్న, బాషబోయిన శైలజ, బోడ మంచానాయక్, పాల వెంకన్న, కొవ్వూరి సత్తిరెడ్డి, మూడు వీరన్న, ఆర్మీ రవి, బానోత్ నరేశ్, కేశా యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ కట్ చేసే కాంగ్రెస్ కావాలా.. రైతులను కాపాడే కేసీఆర్ కావాలా...?


బోనకల్లులో భారీ ప్రదర్శన చేస్తున్న మహిళలు

- కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ పాత రోజులు వస్తాయి
- అభివృద్ధి అంటే ఏమిటో పదేళ్ల లో చూశాం
- బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజు
- బోనకల్లు మండలంలో విస్తృత ప్రచారం
- ఘనస్వాగతం పలికిన ప్రజలు

బోనకల్లు, నవంబర్ 13 : కరెంట్ కట్ చేస్తూ రైతులను ఇబ్బందులు పెట్టిన కాంగ్రెస్ పాలన కావాలా..? నిత్యం రైతులను కాపాడే కేసీఆర్ ప్రభుత్వం కావాలా అని మధిర బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి లింగాల కమల్‌రాజు నియోజకవర్గ ప్రజలే తేల్చుకోవాలని అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని బోనకల్లు, ఆళ్లపాడు, గోవిందాపురం-ఎ, రాయన్నపేట, మోటమర్రి, కలకోట, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావుతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. డప్పువాయిద్యాలతో పూలుచల్లుతూ గ్రామాల్లో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ 24 గంటలు రైతాంగానికి ఉచితంగా విద్యుత్ అందిస్తున్నారన్నారు. కానీ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కేవలం మూడు గంటలు కరెంట్ ఇస్తే సరిపోతుందని ప్రచార సాదనాల ద్వారా ఇంటర్వ్యూలో మాట్లాడడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పాలన వస్తే మళ్లీ ఆత్మహత్యలు, రైతుల కరెంట్ షాక్‌లతో మరణాలు తప్పవన్నారు. ఇలాంటి ప్రభుత్వం రాకుండా రైతాంగం సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే భట్టివిక్రమార్క కనీసం ప్రజలకు అందుబాటులో లేరని అలాంటి వాడిని ప్రజలు గెలిపిస్తే తీరని నష్టం జరుగుతుందన్నారు. తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను అందించడంలో కృషి చేస్తున్నానన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థిని అసెంబ్లీకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు, మాజీ జడ్పీటీసీ బానోతు కొండ, సహకార సంఘం అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు, మధిర మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ జంగా రవికుమార్, నాయకులు పారా ప్రసాద్, ఇటికాల శ్రీనివాసరావు, తాళ్లూరి హరీశ్, వీరబాబు, చావా హనుమంతరావు, జెర్రిపోతుల రవీందర్, వంగాల కృష్ణ, గాదె నర్వోత్తమరెడ్డి, గుండపునేని సుధాకర్‌రావు, గండమాల చుక్కారావు, మోర్ల నరసింహారావు, కాకాని శ్రీనివాసరావు, కరివేద సుధాకర్, మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి..


మాట్లాడుతున్న హరిప్రియానాయక్

- ఇల్లెందు అభ్యర్థి బానోత్ హరిప్రియ
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం
- అభివృద్ధి, మ్యానిఫెస్టోను వివరిస్తూ ఓట్లు అభ్యర్థన
- ఆదరించిన అన్ని వర్గాల ప్రజలు

టేకులపల్లి, నవంబర్ 13 : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇల్లెందు నియోజక వర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశా.. మరింత అభివృద్ధి చేసేందుకు మరో సారి ఆశీర్వదించాలని ఇల్లెందు ఎమ్మెల్యే అభ్యర్థిని బానోత్ హరిప్రియానాయక్ అన్నారు. ఆదివారం మండలంలో పలు గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా రామచంద్రునిపేట చర్చిలో స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం రామచంద్రునిపేట, తోలెం రామయ్య గుంపు, మురుట్ల గ్రామాలో ప్రచారం చేశారు. గ్రామ సెంటర్లలో సర్పంచ్ ఈసాల ఉపేందర్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరిజన గ్రామాల అభివృద్ధి, ఎనో ఏళ్లుగా ఉన్న పోడు భూముల సమస్యలను పరిష్కరించిన ఘనత కేసీఆర్‌దే అని అన్నారు. దేశంలో 29వ రాష్ట్రంగా ఏర్పాడిన తెలంగాణకు తొలి సీఎం ఉద్యమనేత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో పదేళ్లలో రైతులకు, బడుగు బలహీన వర్గ ప్రజల అభివృద్ధికి ఎంతో కృషి చేసిన కేసీఆర్ నాయకత్వంలో ఇల్లెందు అభ్యర్థిగా మీ ముందుకు వచ్చినని అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో ఇల్లెందు రూపురేఖలు మార్చామని అన్నారు. మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. అనంతరం బోడు, బోడు కొత్తగూడెం, లాక్యతండా, మొక్కంపాడు, మొక్కంపాడు తండా, ఎర్రయిగూడెం, కారేపల్లి తండా, పెట్రాంచెలక, బద్దుతండా, తుమ్మలచెలక తదితర గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. అడుగడుగునా ఆమెకు అపూర్వస్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్, బోడ బాలునాయక్, బానోత్ రామానాయక్, బానోత్ కిషన్‌నాయక్, చీమల సత్యనారాయణ, కంభంపాటి చంద్రశేఖర్‌రావు, దరావత్ బాలాజీ, ఇస్లావత్ బాలునాయక్,దళపతి శ్రీనివాసరాజు,జాలది అప్పారావు,స్థానిక సర్పంచులు ఈసల ఉపేందర్ బాబు,ఇర్పా లక్ష్మీనారాయణ, బానోత్ విజయ, ఈసం నిర్మాల, బానోత్ వాలునాయక్, ఈసాల దేవయ్య, ఈసం అచ్చయ్య, భద్రం, ఆమెడ రేణుక, ఉండేటి బసవయ్య, మాలోత్ పూల్‌సింగ్, బర్మవత్ శివకృష్ణ, మాలోత్ సురేందర్, భూక్య రాజా, గుగులోత్ కృష్ణ, బానోత్ రవికుమార్, ఆజ్మీర గలక, భూక్య రమేశ్, అనంతుల శ్రీనివాస్, వినోత్ రైన, ఆమెడ నాగభూషనం, ఇస్లావత్ సాయికృష్ణ ,అంతోటి రాకేష్, కాలే అభినయ్, కుమ్మరి కిరణ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


బస్సును తనిఖీ చేస్తున్న చెక్‌పోస్టు సిబ్బంది

# 'సీఎం ప్రగతి రథం'లో తనిఖీలు

సత్తుపల్లిరూరల్, నవంబర్ 13: దమ్మపేటలో జరుగుతున్న ప్రజాశీర్వాద సభకు వెళ్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతిరథంతో పాటు ఆయన వ్యక్తిగత వాహనాలను సోమవారం మేడిశెట్టివారిపాలెం చెక్‌పోస్టు వద్ద సిబ్బంది తనిఖీ చేశారు. తనిఖీలకు ముఖ్యమంత్రి వ్యక్తిగత సిబ్బంది తనిఖీలకు పూర్తిగా సహకరించారు. తనిఖీల తర్వాత వాహనాలు తిరిగి ప్రయాణం సాగించాయి.